క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ సమావేశాన్ని విజయవంతం చేయండి

కాజులూరు: కాజులూరులో గురువారం జరుగనున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు తదితరులు కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం గ్రామంలో ఆయన విలేకురులతో మాట్లాడుతూ కాజులూరు అంబేడ్కర్ భవన్‌లో గురువారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో ఈ కార్యకర్తల సమావేశంలో జరుగనుందన్నారు. మండల గ్రామాలకు చెందిన స్థానిక ప్రజాప్రతినిదులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర సభ పోస్టర్ ఆవిష్కరణ



పీడీఎస్‌యూ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

మండపేట: విజయవాడలో ఈనెల 29న నిర్వహించే పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సభను విజయవంతం చేయాలని ఆ సంస్థ నాయకుడు బి.సిద్ధూ కోరారు. పట్టణంలోని వైష్ణవి ఐటీఐలో విద్యార్థులతో కలసి బుధవారం పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిద్ధూ మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ, వారిని చైతన్య పరచడం, పీడీఎస్‌యూ బలోపేతం ఈ సభ ముఖ్యోద్దేశం అన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ మండపేట టౌన్ నాయకులు బి. ప్రసన్నకుమార్, ఎల్‌వీ లోవరాజు, ఎస్‌వీవీ సతీష్, సీహెచ్ నాగేంద్ర, సతీష్, నాగరాజు, వి బాలాజీ, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి

కాజులూరు: గ్రామాల్లోనూ తినుబండారాలు విక్రయించే వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని గొల్లపాలెం పంచాయతీ కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాలరావు అన్నారు. బుధవారం గ్రామంలో ఆయన పర్యటించి వ్యాపారులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం కురుస్తున్న చెదురుమదురు వర్షాలకు గ్రామాలలో వాతావరణ కాలుష్యం ఏర్పడి అంటురోగాలు ప్రబలేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. బయట మార్కెట్‌లో ఆహారపదార్థాలు విక్రయించే వ్యాపారులు తయారీలోనూ, అమ్మకాల సమయాల్లోనూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆకర్షణగా ఉండేందుకు రంగులు, రసాయనాలు ఉపయేగించడం, బహిరంగంగా మూతలు లేకుండా విక్రయించడం నిర్వహిస్తే ఎఫ్ఎస్ఎస్ యాక్టు-2006 ప్రకారం అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మండపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ బుధవారం వెల్లడించారు. కామర్స్-3, బోటనీ-1, పొలిటికల్ సైన్సు-1, ఫిజికల్ ఎడ్యుకేషన్-1, తెలుగు-1 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. అన్ని అర్హతలు ఉన్న దరఖాస్తులకు ఈ నెల 29వ తేదీ లోగా నేరుగా సర్టిఫికెట్స్‌తో కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పీజీలో 55 శాతానికి పైగా మార్కులతో ఉత్తీర్ణులైన వారికి, ఎన్ఈటీ, ఎస్ఈటీ, పీహెచ్‌డీ కలిగి ఉన్నవారికి, ఆంగ్లంలో బోధించిన అనుభవం ఉన్న వారికి ఎంపికలో ప్రాధాన్యం ఉంటుందని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థిని ఉన్నత చదువుకు డాక్టర్ రాము సాయం

మండపేట: పేద విద్యార్థిని ఉన్నత చదువుకు స్థానిక శ్రీ సాయి ఆర్థోపెడిక్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ రాము రూ.30 వేల ఆర్థిక సాయం అందించారు. బిక్కవోలుకు చెందిన బూడిత జెన్నీఫర్ చురుకైన విద్యార్థిని. పేద కుటుంబానికి చెందిన జెన్నీఫర్ ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్షల్లో బిక్కవోలు మండలంలో ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఆ విద్యార్థిని ఇప్పుడు నీట్ పరీక్షకు సిద్ధం అవుతోంది. ఇందకోసం డాక్టర్ రాము రూ.30,000 ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా ఆ విద్యార్థినికి బుధవారం అందించారు. కార్యక్రమంలో డాక్టర్ రాము సతీమణి వసంత, టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ ఉంగరాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠరావుకు ఏఎస్సైగా పదోన్నతి



రావులపాలెం: స్థానిక పోలీస్‌స్టేషన్ రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ పి.వైకుంఠరావుకు ఏఎస్సైగా పదోన్నతి లభించింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ నుంచి ఉత్తర్వులు అందినట్టు వైకుంఠరావు బుధవారం తెలిపారు. దీంతో సీఐ జేమ్స్ రత్నప్రసాద్, ఇతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

సికిల్ సెల్.. సోకితే డల్



సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య కార్యకర్త

- సాధారణ రక్తహీనతకు పౌష్టికాహారం పరిష్కారం
- ఈ వ్యాధిపై అవగాహన అవసరం
- ప్రజా క్షేత్రంలో కేంద్ర ప్రభుత్వం ప్రచార కార్యక్రమాలు

కపిలేశ్వరపురం: చురుగ్గా ఉండే చిన్నారులు ఒక్కసారిగా పాలిపోయి బక్కచిక్కితే కన్న పేగు తల్లడిల్లుతుంది. ముద్దు చేసి గోరుముద్దలు పెట్టినా చలాకీతనం కానరాకపోతే తల్లిదండ్రులకు కంటికి నిద్ర కరవవుతుంది. చిన్నారుల్లో రక్తహీనత సమస్య తరచూ ఆరోగ్య సమస్యగా మారుతుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రక్తహీనతపై ప్రచార కార్యక్రమాలు చేపడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఇటీవల చర్చనీయాంశమైన సికిల్ సెల్ ఎనీమియాపై సైతం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణలు రూపొందించింది.

సాధారణ రక్తహీనతలే..

మహిళల్లో రక్త హీనత కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వారిలో రక్త హీనత సమస్య పరిష్కారానికై పాఠశాల స్థాయిలోనే విద్యార్థినుల ఆరోగ్య వివరాలను సేకరించడం, తగిన చికిత్స అందించడం అవసరమని గుర్తించారు. అందుకోసం కేంద్ర ప్రభుత్వం అనీమియా ముక్త్ భారత్ పథకాన్ని అమలు చేస్తోంది. అనారోగ్యం పాలైన సాధారణ రోగులతోపాటు విద్యార్థులు, పెద్ద వయసు గల ఆడవారికి సైతం రక్త పరీక్షలు చేసి రక్తహీనత నివారణకు ఈ పథకం ద్వారా కృషి చేస్తున్నారు. రామచంద్రపురం మండలంలోని ఒక ఏరియా ఆసుపత్రి నాలుగు పీహెచ్‌సీలు, కె.గంగవరం మండలంలోని నాలుగు ఆసుపత్రులు, మండపేట మండలంలో ఒక సీహెచ్‌సీ, నాలుగు పీహెచ్‌సీలు, కపిలేశ్వరపురం మండలంలోని మూడు పీహెచ్‌సీలు, రాయవరం మండలంలోని రెండు పీహెచ్‌సీల పరిధిలో రక్తహీనతపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.

కేంద్ర ప్రభుత్వ కార్యాచరణ ఇలా...

2047 నాటికి సికిల్ సెల్ ఎనీమియాను నిర్మూలించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేసింది. వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక గుర్తింపు కార్డులందజేస్తుంది. ఈ విషయాన్ని ఇటీవల మంగళగిరికి వచ్చిన గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే తెలిపారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనా మిషన్‌లో భాగంగా రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమం, మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖల సమన్వయంతో కార్యక్రమాలు చేపడుతున్నారు. అవగాహన కల్పించడం, నిర్ధారణకై పరీక్షలు చేయడం, వ్యాధి సోకినవారికి కౌన్సిలింగ్ నిర్వహించడమనే కార్యాచరణను చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా జూన్ 19న ప్రపంచ సికిల్‌సెల్ అవేర్‌నెస్ డేను పాటిస్తున్నాయన్నారు.

విద్యార్థి దశ నుంచి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



విద్యార్థి దశ నుంచి ఆరోగ్యం పై ప్రత్యేక మైన శ్రద్ధ పెట్టాలి. ప్రభుత్వం చేస్తున్న కృషికి తల్లిదండ్రులు సైతం సహకరించాలి. తరచూ విద్యార్థిని ఆరోగ్య విషయంలో మార్పులను గమనిస్తుండాలి. రక్తహీనత సమస్య పరిష్కారం కోసం ఆహారంలో ఆకుకూరలు, పండ్లు ఉండేలా జాగ్రత్తపడాలి. మోతాదుకు తగినట్టు మాంసాహారాన్ని అందిస్తుండాలి. పెద్దవారు ఆహారంతోపాటు జీవన శైలిలో సైతం మార్పులు చేసుకోవాలి.

– డా.కరుణేంద్రకుమారి, వైద్యాధికారి, అంగర పీహెచ్‌సీ

సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి లక్షణాలివీ..

రక్త కణాల సంఖ్య తగ్గడంతో రక్తహీనత వస్తుంది. కళ్లు పసుపు రంగులోకి మారతాయి. తీవ్రమైన ఒళ్ల, కీళ్లనొప్పులు వస్తాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట సంభవిస్తుంది. అంటు వ్యాధులు సంక్రమించడమూ, శరీర అవయవాలు దెబ్బతినడం జరుగుతాయి. వీపు, కాళ్లు, ఛాతీ భాగాల్లో విపరీతమైన నొప్పి వస్తుంటుంది. విరేచనాలు, జ్వరం, డీహైడ్రేషన్స్ ఒత్తిడి, అలసట వంటి లక్షణాలు నొప్పులను మరింత తీవ్రం చేస్తాయి.

వ్యాధికి కారణాలు

జన్యుపరమైన ఎర్ర రక్తకణాల రుగ్మతను సికిల్ సెల్ ఎనీమియా అంటారు. శరీర కణజాలానికి ప్రాణవాయువును అందించే గుండ్రని ఆకారం కలిగిన ఎర్ర రక్తకణాలు సికిల్ (కొడవలి) ఆకారంలోకి మారడంతో రక్త నాళాలు మూసుకుపోయి ప్రమాదం వాటిల్లుతుంది.

హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్నవారిని వ్యాధి ఆశిస్తుందన్నారు. వ్యాధి సోకిన వారిలో ఒక జన్యువు కొడవలి ఆకారంలోనూ, మరొకటి సాధారణ ఆకారంలోనూ ఉన్నట్టయితే వారిని సికిల్ సెల్ క్యారియర్లు అంటారు. వారికి ఎలాంటి అనారోగ్యమూ కలగదు. కానీ ఇలాంటి లక్షణాలు కలిగిన ఇద్దరికి జన్మించే సంతానంలో రెండు జన్యువులు కొడవలి ఆకారంలోకి మారడంతో ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. పుట్టిన తర్వాత 5-6 నెలల వరకూ వ్యాధి లక్షణాలు బయట పడవు. సాధారణంగా రక్తకణాలు 120 రోజుల వరకూ జీవించి ఉంటాయి. కాని సికిల్ సెల్ వ్యాధి బారిన పడిన పిల్లల్లో 20-25 రోజులు మాత్రమే ఉంటాయి. రక్తకణం ఆకారం కొడవలి ఆకారంలో ఉండడంతో రక్తనాళాల్లో సరిగ్గా ప్రవహించక పోవడమూ, సరైన మందులు లభ్యం కాకపోవడంతో ప్రాణవాయువు అందక 15 ఏళ్ల లోపే చనిపోతున్నారు.

వ్యాధి కట్టడి ఇలా...

గిరిజన జనాభాలో ప్రతి 86 మందిలో ఒకరికి వ్యాధి సోకుతున్నట్టు గుర్తించారు. వివాహం చేసే ముందు ఇద్దరికీ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు చేయడం ద్వారా వ్యాధిని నియంత్రించవచ్చు. క్యారియర్ల . మధ్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

డ్రగ్స్ నివారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినం సందర్భంగా రామచంద్రపురం పట్టణంలో ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు రామచంద్రపురం డీఎస్పీ బి రామకృష్ణ ఆధ్వర్యంలో సీఐ పి.దొరరాజు, ఎస్సై సురేష్ బాబు ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ పోలీసులు రామచంద్రపురంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆర్డీవో ఎస్.సుధాకర్ హాజరయ్యారు. తొలుత స్థానిక వీఎస్ఎం.కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్లే కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ యుక్త వయసులో చెడు వ్యసనాలకులోను కాకుండా విద్యపై దృష్టి పెట్టాలని, మాదక ద్రవ్యాలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డీఎస్పీ రామకృష్ణ మాట్లాడుతూ ఎదిగే వయసులో ఉన్న పిల్లలకు యువకులకు సరైన అవగాహన లేక తప్పుడు మార్గంలో వెళ్లి మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు పాడు చేసుకుంటారని వాటికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం వీఎస్ఎం కళాశాల నుంచి ప్రదాన రహదారిలో నిర్వహించిన ర్యాలీని మంత్రి సుభాష్ జెండా ఊపి ప్రారంభించారు. వీఎస్ఎం కళాశాల అధ్యాపక బృందం, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి



విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ శాస్త్రి

మండపేట: మాదక ద్రవ్యాల వంటి చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని పట్టణ ఎస్ఐ హరికోటి శాస్త్రి సూచించారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దినోత్సవం సందర్భంగా స్థానిక ఆదిత్య కాలేజీలో సామాజిక కార్యకర్త చిర్ల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పట్టణ ఎస్ఐ హరికోటి శాస్త్రి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. గంజాయి, మత్తు పదార్థాలు, సిగరెట్లు వంటి వ్యసనాలకు అలవాటు పడితే విద్యార్థుల జీవితాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు అమ్ముతున్నట్టు తెలిస్తే తమకు సమాచారం అందివ్వాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎస్ఐ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దూమపాన వ్యతిరేక ప్రచార కమిటీ కన్వీనర్, జనవిజ్ఞాన వేదిక నాయకుడు ఎన్. సూర్యనారాయణ, ఎ. సుధాకర్, రామచంద్రారెడ్డి, రాజేంద్ర, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకుడు చక్కా రాంబాబు, కాలేజ్ ప్రిన్సిపాల్ చిర్ల సుబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతోనే ప్రశాంత జీవనం

- కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్
- పసలపూడిలో ముగిసిన మూడు రోజుల యోగ బట్టీ

రాయవరం: నేటి యాంత్రిక జీవనంలో ప్రతి ఒక్కరికీ ధ్యానం అవసరమని, ధ్యానంతోనే మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. మండలంలోని పసలపూడి బ్రహ్మకుమారీ ఓం శాంతి ఆశ్రమంలో మూడు రోజులుగా జరుగుతున్న యోగ బట్టీ ఆధ్యాత్మిక కార్యక్రమం ముగింపు సభలో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రశాంత జీవనానికి యోగా, ధ్యానం అవసరమన్నారు. సమాజంలో ప్రశాంత వాతావరణం ఏర్పడడానికి, శాంతియుత జీవనానికి కృషి చేస్తున్న పసలపూడి బ్రహ్మకుమారీలను ఆయన అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజ ప్రగతికి దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ వారికి వీలైనంత సమయాన్ని ధ్యానానికి కేటాయించాలన్నారు. కార్యక్రమంలో రాజస్థాన్ రాష్ట్రం మౌంట్‌అబూ నుంచి వచ్చిన బ్రహ్మకుమార్ వీకే భగవాన్ భాయ్ మాట్లాడుతూ నెగిటివ్ థింకింగ్‌ను పాజిటివ్ థింకింగ్‌గా మార్చుకోవాల్సిన విధానాలను వివరించారు. అలాగే సకారాత్మక ఆలోచలు ఏ విధంగా చేయాలనే అంశంపై వివరించారు. బ్రహ్మకుమారి మాధవి మాట్లాడుతూ వీకే భగవాన్‌భాయ్ ఇప్పటి వరకు 12 వేల పాఠశాలల్లో విద్యార్థులకు, 1200 కారాగారాల్లో ఖైదీలకు ఈశ్వరీయ సందేశాన్ని అందించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం మంత్రి సుభాష్‌ను బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విద్యాలయం నిర్వాహకురాలు మాధవి ఆధ్వర్యంలో దుశ్శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. బ్రహ్మకుమారీలు విజయకుమార్, శేషు, సుధ, మంజుల, శారద తదితరులు పాల్గొన్నారు.

తోటపేట ఉప సర్పంచ్ పదవికి రాజీనామా



ఈఓపీఆర్డీ సెలత్‌రాజుకు రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న మేర్నీడి శ్రీను

రామచంద్రపురం రూరల్: మండలంలోని తోటపేట గ్రామ ఉప సర్పంచ్ మేర్నీడి వెంకటేశ్వరరావు(మేర్నీడి శ్రీను) బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజుకు తన రాజీనామా లేఖను అందజేశారు. తన వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్టు మేర్నీడి శ్రీను తెలిపారు. అయితే సర్పంచ్, ఉప సర్పంచ్ ఎన్నికల సమయంలోనే రెండున్నర సంవత్సరాలు మేర్నీడి శ్రీను, రెండున్నర సంవత్సరాలు అల్లం తాతాజీకి ఇవ్వాలని చేసుకున్న ఒప్పందం ప్రకారం రాజీనామా చేసినట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది ఉప సర్పంచ్ పదవిని ఆశిస్తున్నప్పటికీ తోటపేట వార్డు సభ్యులు కోట శ్రీనివాసరావు, ఇళ్ల సూరిబాబు, దాకమర్రి దుర్గ తదితరులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దామిశెట్టి గంగాపురుషోత్తం సూచనల మేరకు 7వ వార్డు సభ్యుడు అల్లం తాతాజీ(గెద్దం తాతాజీ)కి మద్దతు పలుకుతుండడంతో అతడిని ఉప సర్పంచ్‌గా ఎన్నుకోనున్నట్టు చెబుతున్నారు.

జూలై 15 లోగా టిడ్కో పనులు పూర్తికావాలి

- ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు
- కాలనీని సందర్శించి, పనుల పురోగతిపై సమీక్ష



టిడ్కో పనులను సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: స్థానిక గొల్లపుంత కాలనీలో నిర్మించిన టిడ్కో అపార్ట్‌మెంట్ల పెండింగ్ పనులన్నింటినీ జూలై 15 లోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈ గడువు లోగా పనులు పూర్తి చేయించాల్సిన బాధ్యత 14 సచివాలయాల అడ్మిన్‌లదే అని ఆయన స్పష్టం చేశారు. బుధవారం ఆయన టిడ్కో కాలనీని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఉద్యోగులను హెచ్చరించారు. పెండింగ్ పనులు పూర్తయ్యే వరకూ తాను, మున్సిపల్ కమిషనర్ బి. రాము కూడా ఇక్కడే వుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఒక్కో సచివాలయానికి 7 బ్లాకుల చొప్పున అప్పగిస్తున్నామన్నారు. జంగిల్ క్లియరెన్స్, శానిటేషన్, శ్లాబ్ లీకేజీల వంటి పనులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ బొడ్డేపల్లి రాము, డీఈ శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, పలువురు టీడీపీ నాయకులు సచివాలయం, టిడ్కో సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణరెడ్డి సేవలు చిరస్మరణీయం



నారాయణరెడ్డికి నివాళులు అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మండపేట: న్యాయవాదిగా పేదలు, బడుగు బలహీన వర్గాల వారికి కేఆర్‌సీ నారాయణరెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని జనవిజ్ఞాన వేదిక అంబేడ్కర్ కోనసీమ జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు, ప్రముఖ హోమియో వైద్యుడు చల్లా రవికుమార్ పేర్కొన్నారు. నారాయణరెడ్డి సంస్మరణ సభను ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో నిర్వహించారు. అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు గండి స్వామి ప్రసాద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజబాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి దూలి జయరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కృష్ణవేణి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ తదితరులు నారాయణరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ న్యాయవాదిగా నారాయణరెడ్డి పేదలకు అందించిన సేవలను ప్రస్తావించారు. కార్యక్రమంలో గంపల సత్యప్రసాద్, చుండ్రు సోమరాజు, వ్యాపారవేత్తలు ద్వారంపూడి సుబ్బారెడ్డి, బొబ్బా శ్రీనివాస్, విశ్రాంత జిల్లా ప్రధాన న్యాయమూర్తి కావూరి జయకుమార్, ఆలమూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జొన్నపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



తాళ్లపొలంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం రూరల్: తాళ్లపొలం మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మేడిశెట్టి శ్రీమసేను అందజేసిన విద్యా సామగ్రిని మంత్రి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం మధ్యాహ్న పథకంలో అందజేసేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. నెలలో రెండు రోజులు విద్యార్థులతో కలసి ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఏలూరి ఏసుదాస్, దొంగల శ్రీధర్, మేడిశెట్టి భాస్కరరావు, వనుం శ్రీను, ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిక్వెస్ట్ స్టాప్‌లో బస్సు ఆగేలా చూడండి



డయల్ డీఎం కార్యక్రమంలో మాట్లాడుతున్న డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు

రామచంద్రపురం రూరల్: స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో నలుగురు తమ సమస్యలను తెలియజేసినట్టు డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు తెలిపారు. రామచంద్రపురం మండలం వేగాయమ్మపేటకు చెందిన టేకుమూడి శ్రీనివాస్ తమ గ్రామంలో ఆంజనేయస్వామి గుడి వద్ద డిపో వారు ఇచ్చిన రిక్వెస్ట్ స్టాప్ బోర్డు ఉన్నా బస్సులు ఆపడం లేదని తెలియజేయగా, ఇక నుంచి బస్సులు ఆగేలా చూస్తామని సిబ్బందికి తెలిపారు. అదే విధంగా కె.గంగవరం మండలం శివల గ్రామానికి చెందిన వాసంశెట్టి సత్తిబాబు రామచంద్రపురం నుంచి శివల మీదుగా పేకేరు వెళ్లే బస్సును పునరుద్ధరించాలని కోరగా, రోడ్డు అభివృద్ధి పనుల జరుగుతున్నందున నిలిపి వేశామని, రోడ్డు నిర్మాణం పూర్తయిన వెంటనే బస్సు సర్వీసును నడుపుతామన్నారు. ఊడిమూడికి చెందిన తిరంశెట్టి గోపాల్ రామచంద్రపురం నుంచి సుందరపల్లి బస్సును పునరుద్ధరించాలని కోరగా రోడ్డు నిర్మాణం పూర్తయిన తరువాత నడుపుతామని తెలిపారు. అమలాపురానికి చెందిన గండేపల్లి భీమశంకరం రామచంద్రపురం నుంచి యానం మీదుగా అమలాపురానికి ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసును వేయాలని కోరగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని డీఎం వెంకటేశ్వర్లు తెలిపారు.

వంతెన అప్రోచ్ బాగు చెయ్యరూ?



అధ్వానంగా ఉన్న వంతెన అప్రోచ్

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, మండల కేంద్రమైన ఆలమూరు రహదారిలో సూర్యారావుపేట వద్ద ఉన్న వంతెన అప్రోచ్ అధ్వానంగా ఉంది. వంతెన అప్రోచ్ ఛిద్రం కావడంతో ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అప్రోచ్ దిగుతున్నపుడు జారి పడుతున్నారు. వంతెన ఎత్తుగా ఉండటంతో ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. కపిలేశ్వరపురం మండలంలోని అంగర, టేకి, మాచర, కోరుమిల్లి, తాతపూడి గ్రామాల ప్రజలు ఆలమూరు, మండపేట వెళ్ళేందుకు ఈ రహదారి పైనే వెళ్తుంటారు. ప్రాధాన్యతగల రహదారి కావడంతో అప్రోచ్‌ను బాగుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కల్వర్టు నిర్మాణం పూర్తి చేయాలి



అసంపూర్తిగా ఉన్న కల్వర్టు నిర్మాణం

కాజులూరు: గొల్లపాలెం శివారు చీకట్లవారిపేటకు వెళ్లే రహదారిలో పంటకాలువపై ఉన్న కల్వర్టు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. బంధనపూడి రోడ్డు నుంచి చీకట్లవారిపేటకు వెళ్లేందుకు పంటకాలువపై కల్వర్టు లేకపోవడంతో 12 సంవత్సరాల క్రితం గ్రామ పర్యటనకు వచ్చిన అప్పటి ఎమెల్యే, ప్రస్తుత ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ కల్వర్టు నిర్మాణానికి పంచాయతీ రాజ్ నుంచి రూ.లక్ష నిధులను మంజూరు చేశారు. నిర్మాణం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కాలువపై శ్లాబ్ ఏర్పాటు చేసి దానికి ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించకుండా వదిలివేశారు. రక్షణ గోడల కోసం ఏర్పాటు చేసిన ఊసలు బయటకు కనిపిస్తూ ప్రమాదకరంగా ఉన్నాయి. వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పి రక్షణ గోడలు లేక కాలువలోనికి బోల్తా పడుతున్నాయి. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్మాణంలో పీహెచ్‌సీ అదనపు భవనం



నిర్మాణంలో ఉన్న అంగర పీహెచ్‌సీ అదనపు భవనం

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర గ్రామానికి చెందిన బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆర్థిక సౌజన్యంతో అంగర పీహెచ్‌సీ ఆవరణలో అదనపు భవనం నిర్మాణంలో ఉంది. పనులు వేగంగా సాగుతున్నాయి. అంగర గ్రామానికి చెందిన దాత బలుసు సుబ్బారావు, వసుంధర దంపతుల పేరున ప్రత్యేక బ్లాకు నిర్మాణానికి రూ.50 లక్షల విరాళం అందజేయడంతో నిర్మాణం సాగుతోంది. త్వరితగతిన భవన నిర్మాణ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు ట్రస్టు నిర్మాహకులు, వైద్యాధికారి రత్నకుమారి తెలిపారు.